

ప్రత్యర్థులెవరు..



బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారుతో.. నియోజకవర్గాల్లో ప్రచార హోరు

- ఇమడలేక.. వెళ్లలేని సంకట స్థితిలో మైనంపల్లి, బేతి సుభాష్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీలలో టికెట్ కోసం పలువురి నేతల ప్రయత్నాలు
- అభ్యర్థుల ఎంపికపై అధిష్టానం కసరత్తు.. ఆశావహుల్లో ఉత్కంఠ
- ఎన్నికల వేళ.. మేడ్చల్ జిల్లాలో రాజకీయ 'సందడి'

సాక్షి, మేడ్చల్ జిల్లా: బరిలో నిలిచేదెవరు? గులాబీ పార్టీ అభ్యర్థులను ఢీకొట్టేదెవరు? అనే చర్చ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఊపందుకుంది. అనూహ్యంగా అధికార బీఆర్‌ఎస్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీలో నిలిపే వారి పేర్లను ఖరారు చేయటంతో అభివృద్ధి కార్యక్రమాలతో పేరుతో ప్రచార హోరుతో ప్రజలకు వద్దకు వెళ్తున్నారు. ఉప్పల్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని కాదని కొత్త వారికి ఇవ్వగా.. మల్కాజిగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లికి టికెట్ ఇచ్చినప్పటికీ, తనయుడికి మెదక్ టికెట్ కేటాయించలేదని అధిష్టానంపై ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఇద్దరు సిట్టింగ్‌లు బీఆర్‌ఎస్‌లో ఇమడలేక.. బయటకు వెళ్లలేని సంకట పరిస్థితిలో సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. మరో పక్క అధికార పక్షం అభ్యర్థులకు దీటుగా.. విపక్షాలు ఎవరిని రంగంలోకి దింపుతాయనే ఉత్కంఠ అందరిలో ఉంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ వ్యూహాలేంటి అన్న చర్చ కూడా జోరుగా సాగుతుండగా.. ఆ పార్టీలకు చెందిన ఆశావహులు మాత్రం పలు రాజకీయ, సామాజిక సమీకరణాల నేపథ్యంలో టికెట్ తమకే లభిస్తుందనే ధీమాతో వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ల కోసం ఇప్పటికే పలువురు దరఖాస్తు చేసుకోగా, అధిష్టానం వడపోత కార్యక్రమాన్ని మొదలు పెట్టింది.

మల్కాజిగిరి

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును అధిష్టానం ప్రకటించినా.. తనయుడు రోహిత్‌కు మెదక్ టికెట్ కేటాయించలేదన్న అసంతృప్తితో మంత్రి హరీష్‌రావుపై నిప్పులు చెరిగారు. ఈ విషయంలో మైనంపల్లి తీరుపై సీఎం కేసీఆర్ సహా వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రుగా ఉండగా, అధిష్టానం కూడా ఆయనపై వేటుకు రంగం సిద్ధం చేసినట్లు బీఆర్‌ఎస్‌లో చర్చ సాగుతోంది. బీఆర్‌ఎస్‌లో ఉండలేక.. బయటకు వెళ్లలేని సంకట పరిస్థితిని మైనంపల్లి ఎదుర్కొంటుండగా, అధిష్టానం కూడా మైనంపల్లిపై చర్యలకు సిద్ధపడకుండా మెత్తపడినట్లు ప్రచారం. ఒకవేళ అధిష్టానం మైనంపల్లి హన్మంతరావుపై సీరియస్‌గా వ్యవహరిస్తే.. మల్కాజిగిరి నుంచి మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి లేదా ఎమ్మెల్సీ శంబీపూర్ రాజును బరిలో దింపవచ్చనే చర్చ సాగుతోంది. మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ముగ్గురు నాయకులు దరఖాస్తు చేసుకున్నా పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్‌కే దక్కుతుందని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మరో ఇద్దరు అన్నె వెంకట సత్యనారాయణ, బోనగిరి సురేష్‌యాదవ్ ఉన్నారు. మల్కాజిగిరిలో బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కొత్తగా పార్టీలో చేరిన ఆకుల రాజేందర్, యువమోర్చా నాయకుడు భానుప్రకాష్ పోటీ పడుతున్నారు.

కూకట్‌పల్లి

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరోసారి కూకట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తుండగా, కాంగ్రెస్ నుంచి కూకట్‌పల్లి టికెట్ కోసం 16 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి దరఖాస్తు చేసుకున్న వారిలో గొట్టిముక్కల వెంగళరావు, సత్యం శ్రీరంగం, గాలివీర రామచంద్రబాలాజీ, పటోళ్ల నాగిరెడ్డి, వెలగపూడి వీవీస్ చౌదరి, మన్నె సతీష్‌కుమార్, ఆశపల్లి విజయచంద్ర, జాఫర్ అలీ, కొండకింది పుష్పారెడ్డి, దండుగుల యాదగిరి, మెడికొండ వెంకటమురళీ కృష్ణ, భక్త వత్సలం, జూలూరి ధనలక్ష్మీగౌడ్, పోట్లూరి శ్రీనివాస్‌రావు, దెరాటి మధుసాగర్, గొట్టిముక్కల పద్మరావు ఉన్నారు. కూకట్‌పల్లిలో బీజేపీ నుంచి అర్బన్ జిల్లా అధ్యక్షుడు పి.హరీష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు మాధవరం కాంతారావు, కొత్తగా పార్టీలో చేరిన ప్రేమ్‌కుమార్ పోటీ పడుతున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది.

కుత్బుల్లాపూర్

సిట్టింగ్ ఎమ్మెల్యే కేపీ వివేకాందగౌడ్‌కు బీఆర్‌ఎస్ మళ్లీ టికెట్ కేటాయించడంతో.. అభివృద్ధి పనుల పేరుతో ప్రజల వద్దకు వెళ్తుండగా, కాంగ్రెస్ నుంచి టికెట్ కోసం 12 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. నర్సారెడ్డి భూపతిరెడ్డి, కొలన్ హన్మంతరెడ్డి, కందాడి జ్యోత్స్నదేవి, సాంటిరెడ్డి పున్నారెడ్డి, ఉసిరిక అప్పిరెడ్డి, మహ్మద్ నిజాముద్దీన్, గుంజ శ్రీనివాస్, బండి సత్యంగౌడ్, దూళిపాక సాంబశివరావు, పోలీసు సుమిత్రారెడ్డి, అహ్మద్ నిజామొద్దీన్, బోనగిరి ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. ఇక్కడ బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి పోటీకి ఆసక్తి చూపుతున్నారు.

మేడ్చల్

సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి చామకూర మల్లారెడ్డికి మళ్లీ మేడ్చల్ టికెట్ దక్కడంతో బలమైన పోటీదారుడుగా ప్రచార పర్వంలో ముందువరుసలో ఉన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ అనే నినాదంతో పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూరి వజ్రేష్(జంగయ్య)యాదవ్, అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇక్కడి నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం వీరితోపాటు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్, పిసరి మహిపాల్‌రెడ్డి, పి.బాలేష్, గువ్వ రవి దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సామాజిక వర్గానికి టికెట్ ఇస్తే తొటకూరి వజ్రేష్(జంగయ్య)యాదవ్, రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తే హరివర్ధన్‌రెడ్డికి దక్కవచ్చనే ప్రచారం ఆ పార్టీలో సాగుతోంది. బీజేపీ నుంచి పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు కొంపెల్లి మోహన్‌రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డితో సహా రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.

ఉప్పల్

◆ ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డిని కాదని, బండారి లక్ష్మారెడ్డికి బీఆర్‌ఎస్‌కు అధిష్టానం టికెట్ కేటాయించడంతో కార్యకర్తల సమావేశాల పేరుతో నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. దీంతో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తానేని తప్పు చేశానో చెప్పకుండా..టికెట్ నిరాకరించడంపై ఆయన గుర్రుగా ఉన్నారు. అనుచరులు, కార్యకర్తలతో చర్చించి పది రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్న తీరుపై పార్టీలో తీవ్ర చర్చ సాగుతోంది. అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాత్రం ప్రజల మద్దతు పొందేందుకు అనుచరులతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఉప్పల్ టికెట్ కోసం ఆరుగురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో ఎం.పరమేశ్వర్‌రెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, అమరిశెట్టి నరేందర్ ఉన్నారు. టికెట్ విషయంలో ముగ్గురి మధ్యే పోటీ ఉండగలదని పార్టీలో ప్రచారం సాగుతోంది. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్‌తో పాటు మరో నాయకుడు పద్మారెడ్డి పోటీ పడుతున్నారు. అధిష్టానం మాత్రం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ వైపు మొగ్గు చూపవచ్చనే ప్రచారం పార్టీలో సాగుతోంది.

మైనార్టీల సంక్షేమానికి కృషి

● మంత్రి చామకూర మల్లారెడ్డి

బోడుప్పల్: మైనార్టీల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బోడుప్పల్‌లోని కుతుబ్‌షాహి మసీదు ఆవరణంలో కో ఆప్షన్ సభ్యులు నాజీయా అబ్దుల్ అలీం, మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ముస్లిం మైనార్టీలు అనేక మంది ఉన్నారని, వారి సంక్షేమానికి బీఆర్‌ఎస్ ఎంతో కృషి చేస్తుందన్నారు. సామూహిక ప్రార్థనల కోసం ఈద్గా, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖబ్రస్థాన్ కోసం 5 ఎకరాల స్థలం కేటాయించాలని ముస్లిం పెద్దలు మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనువైన స్థలం కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ సామల బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి, మసీద్ అధ్యక్షుడు మొహమ్మద్ తాజుద్దీన్, మహబూబ్ అలీ, ఖాదర్, జాకీర్, ఖాన్, గౌస్, రజాక్, హమీద్, అహ్మద్, గులాం పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

● మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని ఆర్‌కే పురం చెరువు సుందరీకరణ కోసం రూ.7.90 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువు సుందరీకరణ అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ అధికారులు ఈఈ పద్మా, డీఈ జగన్మోహన్‌రావు, ఏఈ శివకుమార్‌రెడ్డి, నాయకులు ఉపేందర్‌రెడ్డి, కరమ్ చంద్, సతీష్‌కుమార్, రాముయాదవ్, గుండా నిరంజన్, పిట్ల శ్రీనివాస్, గోకుల్‌కుమార్ ఉన్నారు.

రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలి

వినియోగదారుల రుచులకు అనుగుణంగా ఆహార పదార్థాలు అందించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. ఓల్డ్ అల్వాల్ నల్ల పోచమ్మ కమాన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హట్కే బకెట్ బిర్యానీ సెంటర్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. నిర్వాహకులు బ్రహ్మ, జ్ఞానకేష్‌తోపాటు కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: దశలవారీగా అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 15వ డివిజన్‌లోని రాజలింగం కాలనీ ఫేస్–2లో రూ.15 లక్షలతో.. బాలాజీనగర్‌లో మరో రూ.9 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. కాలనీవాసులు మరికొన్ని ముఖ్యమైన సమస్యలను మేయర్ దృష్టికి తీసుకురాగా, వాటికి నిధులు కేటాయించి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ను అభివృద్ధి చేస్తా

- ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తానని ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం లక్ష్మారెడ్డి కమ్యూనిటీ హాల్‌లో మేకల హనుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బండారి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానని అందరినీ కలుపుకొని పోతాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మేకల మధుసూదన్‌రెడ్డి, రంగనాథ్‌గౌడ్, గోనే అర్జున్‌రెడ్డి, హనుమంత్, జహంగీర్, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, ఇంద్రారాణి, సలీం, సుధాకర్ తదితరులు ఉన్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబికాదేవి ఆలయంలో శ్రావణ మాసం మూడవ శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి 56 రకాల మిఠాయిలతో మహా నివేదనతో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

పార్కు పనులను పరిశీలించిన కమిషనర్



పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

బోడుప్పల్: 7వ డివిజన్ లక్ష్మినగర్ కాలనీలోని హుడా పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎండీఏ ద్వారా చేపట్టిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు పచ్చదనం పెంచుతున్నామన్నారు. త్వరలో పచ్చని చెట్లతో స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించనున్నట్లు ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్‌ను గెలిపించి.. సోనియాకు కానుకగా ఇద్దాం

గౌతంనగర్: కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కాంగ్రెస్ సీనియర్ నేత బోనగిరి సురేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్కాజిగిరి రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. నాయకులు తిరుమలరావు, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌కే సాధ్యం



కుషాయిగూడ: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం హెచ్‌బీకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. మేడ్చల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగాల అధ్యక్షులు పత్తికుమార్, గణేష్‌నాయక్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ తెలిపారు. కళాశాలలో ఆంగ్లం సబ్జెక్టు బోధించుటకు ఒక పోస్టు ఖాళీగా ఉందని అతిథి అధ్యాపకులుగా బోధించడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి ఈ నెల 5వ తేదీలోపు బయోడేటాను కళాశాల కార్యాలయంలో సమర్పించగలరని కోరారు. అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియ అనేది కళాశాల విద్యాశాఖ నిబంధనలకు అనుగుణంగా ఉంటుందని అభ్యర్థులు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీలు అయితే 50 శాతం మార్కులతో పాటు సెట్‌నెట్, పీహెచ్‌డీతో పాటు బోధన అనుభవం గల అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. అలాగే అతిథి అధ్యాపక నియామక విధానం గురించి వివరాలకు అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ సంగి రమేష్‌ను ఫోన్: 94404 47737.

ఓటు ప్రాధాన్యం తెలుసుకోవాలి



ఓటు అవగాహన కార్యక్రమంలో ప్రమాణం చేస్తున్న అధికారులు

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరూ ఓటు ప్రాధాన్యం తెలుసుకోవాలని బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ ఆదేశాల మేరకు బోడుప్పల్‌లోని విజన్ ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన ఓటు గురించి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులు ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు ప్రాధాన్యత తెలుసుకోవాలని, ఓటు కలిగిన వారందరూ వినియోగించుకోవాలని కోరారు. ఫారం–6 కొత్త ఓటు నమోదు కోసం, ఫారం–7 ఓటర్ల జాబితా నుంచి తీసివేసేందుకు, ఫారం–8 ఓటర్ల జాబితాలో మార్పుల కోసం అని వెల్లడించారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపెయిన్ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని పోలింగ్ స్టేషన్లల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బోడుప్పల్ కార్యాలయ అధికారి సంగీత, మెప్మ కమ్యూనిటీ ఆర్గనైజర్ భార్గవి, బూత్ అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో హెల్త్ కార్డులు



ఉప్పల్: బండారి లక్ష్మారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పల్ భరత్‌నగర్ కాలనీలో స్థానికులకు హెల్త్ కార్డులను ట్రస్టు నిర్వాహకులు, ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి హాజరై అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రస్టు ద్వారా మరిన్ని సేవలు అందజేస్తానని తెలిపారు. ప్రతి సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం పొందవచ్చన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుంటుంబానికి ఈ కార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆకుల మహేందర్, అన్య బాల కృష్ణ, సర్వారెడ్డి, అల్వాల్ నాగరాజు, మాస శేఖర్ పాల్గొన్నారు.

ఉప్పల్‌లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

ఉప్పల్: చిలుకానగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కరిపే సంతోష్ కుమార్ ఆధ్వరలో గడప గడపకూ పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను సైతం ప్రజలకు తెలిపి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరిపే సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఉప్పల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని, కార్యకర్తల్లో జోష్ నింపి పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామని తెలిపారు. యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రీతి, జిల్లా అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి, కరిపే అనిల్, వెంకట్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

